సాక్షి
వికారాబాద్

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



కొత్త ఆశలతో..

కలెక్టర్ కార్యాలయానికి అనేక సమస్యలతో నిత్యం ఎంతో మంది బాధితులు వస్తుంటారు. 8లో▸



తెలుగు బుక్ఆఫ్ రికార్డులో..

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామానికి చెందిన జంగిలి విష్ణువర్ధన్‌కు చోటు దక్కింది. 8లో▸



అల్పాహార పథకం ఏమైంది?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే బ్రేక్‌ఫాస్ట్ పథకం ఏమైందని మండల సభ్యులు అధికారులను ప్రశ్నించారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

మంత్రి కొండా సురేఖను కోరిన అనంత పద్మనాభస్వామి ఆలయ ట్రస్టీ



మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈవో, ట్రస్టీ

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంతగిరిగుట్ట అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ ట్రస్టీ పద్మనాభం రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. సోమవారం ఆయన ఆలయ ఈవో నరేందర్‌తో కలిసి హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి స్వామి వారి ప్రసాదాన్ని, ప్రతిమను అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి, అటవీ శాఖతో గల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. స్పందించిన మంత్రి కొండా సురేఖ త్వరలోనే అనంత పద్మనాభస్వామిని దర్శించుకోవడానికి వస్తానని తెలిపారు. ఆలయ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వికారాబాద్ అర్బన్: ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో డీఈఈసెట్ -2023 -25 రెండు సంవత్సరాల కోర్సుల్లో చేరడానికి మరో విడతగా ఈ నెల 20న వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ కె.రామాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 30న సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల జనవరి ఒకటి నుంచి 3వ తేదీ వరకు ఫీజు చెల్లించి 5న అలాట్‌మెంట్ లెటర్ పొందాలని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలలో సమర్పించి రిపోర్టు చేయాలని, జనవరి 8 నుంచి తరగతులకు హాజరు కావాలని సూచించారు.

జిల్లాలో నాకాబందీ



వికారాబాద్ పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతగిరి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం నాకాబందీ నిర్వహించినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 1,332 వాహనాలను తనిఖీ చేసినట్లు వివరించారు. సరైన పత్రాలు లేని 15 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలు కాపాడటానికి తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు.

22న యువజనోత్సవాలకు కళాకారుల ఎంపిక

హుడాకాంప్లెక్స్: 27వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు-2024 నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 8.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు యువకళాకారులను ఎంపిక చేస్తామన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సున్న వారు అర్హులని చెప్పారు. జానపద సంగీతం(గ్రూప్/సోలో), జానపద నృత్యం(గ్రూప్/సోలో), కథా-రచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వం, ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో ఎంపికలుంటాయని వివరించారు. జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ఎంపికైన కళాకారులను రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు పంపిస్తామని, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన కళాకారులు జనవరి 24న నిర్వహించే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని చెప్పారు.

'రైతుబంధు'కు నిరీక్షణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే రైతుబంధు డబ్బుల కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా 4,04,436మంది రైతులు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు. వీరి ఖాతాల్లో రూ.378.92కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఈ పంటసాయంపై పలు ఆంక్షలు విధించింది. తొలుత ఎకరంలోపు ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. దీంతో జిల్లా అధికారులు ఎకరంలోపు ఉన్న 1.33లక్షల మంది రైతులను గుర్తించి, వారి వివరాలను ట్రెజరీకి పంపింది. అయితే వీరిలో ఇప్పటి వరకు 87,727 మంది రైతుల ఖాతాల్లో రూ.17.11 కోట్లు మాత్రమే జమ చేసింది. మిగిలిన రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

లేవీ.. బియ్యం ఏవీ?



మిల్లర్ల నుంచి సేకరించిన సీఎంఆర్ రైస్

మిల్లర్ల వద్దే సీఎంఆర్ రైస్

- గతేడాది ఖరీఫ్‌కు సంబంధించి 61శాతం మిల్లర్ల వద్దే
- గత రబీలో వచ్చింది నాలుగు శాతమే
- అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి

వికారాబాద్: లేవీ సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ విషయంలో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సీఎంఆర్‌లో భాగంగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం మిల్లర్లకు కేటాయిస్తూ వస్తున్నారు. అయితే వారు సకాలంలో లేవీ బియ్యం (సుద్ధి చేసిన బియ్యం) ఇవ్వకపోడంతో ధాన్యం సేకరణకు అడ్డంకిగా మారుతోంది. దీంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మిల్లర్లు ఇవ్వాల్సిన లేవీ బియ్యం ఇప్పటి వరకు 39శాతం మాత్రమే పౌరసరఫరాల శాఖకు అందజేశారు. ఇంకా 61శాతం వారి వద్దే ఉన్నాయి. ఇక గత రబీ సీజన్‌కు సంబంధించి ఇవ్వాల్సిన బియ్యం ఇప్పటి వరకు కేవలం నాలుగు శాతమే ఇచ్చారు. దీన్ని బట్టి చూస్తే పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థమవుతుంది.

వచ్చింది నాలుగు శాతమే

లేవీ బియ్యం సేకరణలో అధికారులు ఎంతలా వెనుకబడి పోయారో ఈ గణాంకాలు చూస్తే ఇట్టే అర్థం అవుతోంది. 2022 -23 ఖరీఫ్ సీజన్‌లో మిల్లర్లకు కేటాయించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటి వరకు 39శాతం మాత్రమే లేవీ రూపంలో వచ్చే సీఎంఆర్ బియ్యం పౌరసరఫరాల శాఖకు మిల్లర్లు అందజేశారు. మరో 61 శాతం మిల్లర్ల వద్దే ఉన్నాయి. ఆ సీజన్‌లో 95,095 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు అందజేయగా 63,714 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం పౌరసరఫరాల శాఖకు ఇవ్వాల్సి ఉంది. అయితే సీజన్ ముగిసి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు 24,969 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సివిల్ సప్లై అధికారులకు అందజేశారు. ఇంకా 38,744 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇక గత ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటి వరకు కేవలం ఐదు శాతం మాత్రమే బియ్యం అందజేశారు. కాగా గత రబీ సీజన్‌లో 105 కొనుగోలు కేంద్రాల ద్వారా 85,225 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఈ ధాన్యాన్ని జిల్లాలోని 64 మిల్లులకు కేటాయించారు. ఈ వడ్లకు సంబంధించి 57,953 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం రావాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు నాలుగు శాతం అంటే 2,544 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సివిల్ సప్లై అధికారులకు అందాయి. ఇంకా 55,409 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది.

మిల్లర్లతో అధికారుల కుమ్మక్కు

రైసు మిల్లర్లతో సివిల్ సప్లై అధికారులు కుమ్మక్కు కావటంతోనే వారి నుంచి సీఎంఆర్ రైస్ అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఓ పక్క గడువులోగా మిల్లర్ల నుంచి లేవీ రైస్ సేకరించాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా అధికారులు మాత్రం ఆ దిశగా చొరవ చూపడం లేదు. మిల్లుల్లో నిల్వలు ఉండడంతో ప్రస్తుతం సేకరించిన ధాన్యం ఎక్కడ నిల్వ చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద స్థలం లేక రైతుల నుంచి సేకరించాల్సిన ధాన్యాన్ని నేరుగా మిల్లర్ల వద్దకే పంపారు. దీంతో అదే అదనుగా భావించిన మిల్లర్లు రైతుల దగ్గర క్వింటాలుకు ఆరు నుంచి 10కిలోల ధాన్యాన్ని తరుగు రూపంలో కోత విధించారు. దీంతో అన్నదాతలు మిల్లుల వద్ద ఆందోళన కూడా చేశారు. ఇంత జరిగినా వారు ఇప్పటి వరకు మిల్లర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రైతులకు ఏ న్యాయం చేయలేదు. దీంతో అధికారులు మిల్లర్లతో కుమ్మక్కయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సారైనా ధాన్యం తరలింపునకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

- ప్రాణహిత, పాలమూరు ప్రాజెక్టులను గత ప్రభుత్వం గంగలో కలిపింది
- పరిగి, కొడంగల్‌కు మెడికల్ కాలేజీలు తెస్తాం
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పరిగి: కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును గత ప్రభుత్వం గంగలో కలిపిందని వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న భారీ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు. సోమవారం పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. అలాగే అసంపూర్తిగా ఉన్న పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. వికారాబాద్ జిల్లాకు సీఎం, స్పీకర్ లాంటి అత్యున్నతమైన పదవులు దక్కడం హర్షించదగ్గ విషయమన్నారు. బీఆర్ఎస్ పాలనలో జిల్లా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లన్నీ ధ్వంసమైనట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తాము బీజాపూర్ – హైదరాబాద్ నాలుగు లేన్ల రోడ్డును మంజూరు చేశామని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు భూసేకరణ చేయలేకపోయిందని మండిపడ్డారు. ఈ రోడ్డు విషయాన్ని సీఎంతో చర్చించి త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కొడంగల్, పరిగి పట్టణాల్లో మెడికల్ కళాశాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేయడం జరిగిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీలు అర్హులకు చేరేలా చూస్తామని చెప్పారు. అభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. ప్రజా పరిపాలనలో ప్రజల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు, కుల్కచర్ల ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, పరిగి వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, సీనియర్ నాయకులు చంద్రయ్య, ప్రార్థసారథి, శ్రీనివాస్, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి, నాయకులు ఆనందం తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీటి విడుదల

కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి బేబీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి రబీ సాగుకు సోమవారం రాత్రి తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నీటిని విడుదల చేశారు. ముందుగా ఆయన బేబి కెనాల్ తూమును పైకిలేపి పొలాలకు నీటిని విడుదల చేశారు. తర్వాత కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు కింద ఆయకట్టు ఎంత, ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి.. ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తున్నారు అనే విషయాలను ఈఈ సుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టు కింద 9,200 ఎకరాల ఆయకట్టు ఉందని, ప్రస్తుతం 5,200 ఎకరాలకు నీరందిస్తున్నామని, ధారూరు, పెద్దేముల్ మండలాల్లోని 18 గ్రామాల రైతులకు మేలు జరుగుతోందని ఈఈ తెలిపారు. ప్రాజెక్టు ఆధునీకరణకు ఏమైనా ప్రతిపాదనలు పంపారా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. రూ. 39కోట్లకు పంపామని ఈఈ వివరించారు. డీఈ భాస్కర్, ఏఈ నవీన్, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్ పాల్గొన్నారు.

గజగజ..

- వణికిస్తున్న చలిపులి
- మర్పల్లిలో 13.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- వారం రోజులుగా పడిపోతున్న టెంపరేచర్
- చలిమంటలతో ఉపశమనం



చలిమంట కాచుకుంటున్న జనం

బషీరాబాద్: జిల్లాలో చలి తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు మర్పల్లిలో రాత్రి ఉష్ణోగ్రత అత్యల్పంగా 13.4 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదైంది. ఇదే ఇప్పటి వరకు అత్యల్ప ఉష్ణోగ్రతగా నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారి రాజేందర్ రెడ్డి తెలిపారు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోవడంతో జనం చీకటి పడకముందే గూడు చేరుకుంటున్నారు. ఈ యేడాది భారీ వర్షాలు కురవడంతో డిసెంబర్ రెండో వారం నుంచే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తుపానుప్రభావం వలన కూడా ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మరో నాలుగు రోజులు చలిగాలుల తీవ్రత స్థిరంగా కొనసాగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

సీఎంను కలిసిన కలెక్టర్, ఎస్పీ





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– వికారాబాద్ అర్బన్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్



ఉపాధి హామీ పథకం పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్

కుల్కచర్ల: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్, అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్ హెచ్చరించారు. సోమవారం కుల్కచర్లలో 2021 – 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ఉపాధి పనులను నిర్వహించాలన్నారు. ఇంకుడు గుంతల బిల్లులు చెల్లించకపోవడం, సిమెంట్ కల్లాల నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు తమకు సహకరించకపోవడం వల్ల పూర్తిస్థాయిలో వివరాలు లభించలేదని అడిట్ సిబ్బంది పేర్కొన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా పనుల సమాచారం ఇవ్వలేదని, అలాంటి వారి నుంచి డబ్బు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. సోమవారం 19గ్రామాలకు సంబంధించిన ఆడిట్ కొనసాగింది. రూ. 50వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సరళ, అంబుడ్స్‌మెన్ రాములు, విజిలెన్స్ విభాగం అధికారి భార్గవి, ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, ఎంపీడీఓ నాగవేణి, ఏపీఓ వెంకటేష్, ఈసీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బోనమెత్తిన కొర్విచెడ్

- వైభవంగా మల్లన్న జాతర
- భారీగా తరలివచ్చిన భక్తజనం

బషీరాబాద్: సల్లంగ చూడు మల్లన్న స్వామీ అంటూ బషీరాబాద్ మండలం కొర్విచెడ్ గ్రామం సోమవారం బోనమెత్తింది. మల్లన్న స్వామి జాతరలో భాగంగా ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనంతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

పాంబండ ఆలయ అభివృద్ధికి కృషి



స్పీకర్‌, ఎమ్మెల్యేలకు ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందజేస్తున్న పాలకవర్గం

కుల్కచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని స్పీకర్‌ ప్రసాద్‌ కుమార్‌, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌ రెడ్డి, తిరుపతిరెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండల పర్యటనలో భాగంగా బండవెల్కిచర్లలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో రామలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్య హరిశ్చంద్ర, దేవాదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ శేఖర్‌, ఇన్స్‌పెక్టర్‌ మధుబాబు, ఆలయ చైర్మన్‌ నర్సమ్మరాములు, ఈఓ సుధాకర్‌, సర్పంచ్‌ శిరీషా లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీశ్రీనివాస్‌, అర్చకులు దశరథం, పాండు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలి

స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌



మాట్లాడుతున్న స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌

పూడూరు: విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ అన్నారు. సోమవారం కుల్కచర్లకు అయ్యప్ప పడిపూజకు వెళ్తున్న ఆయన మార్గమధ్యలోని మన్నేగూడలో ఉన్న విస్డం పాఠశాల యజమాన్యం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని చిన్నారులు కష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని సూచించారు. హైదరాబాద్‌ నుంచి రావడానికి ఆలస్యం అయిన కారణంగా చిన్నారులకు స్వయంగా సారీ చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, ఆనందం, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్‌ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అభివృద్ధి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంజుల

అనంతగిరి: మున్సిపల్‌ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతానని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ చిగుళ్లపల్లి మంజుల పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్‌ మున్సిపల్‌ పరిధిలోని ధన్నారం, 15వ వార్డు ఫ్రెండ్స్‌ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో వాటర్‌ పైప్‌లైన్‌, యూజీడీ పనులను చైర్‌పర్సన్‌ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ సహకారంతో పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ప్రజల సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్‌, కౌన్సిలర్‌ అనంత్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్‌, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని బాలాపూర్‌ 15,16 డివిజన్‌ల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌ మేయర్‌ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్‌ ఇబ్రాం శేఖర్‌ విచ్చేసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్లను నాణ్యతతో మన్నికగా వేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదార్లను కోరారు. కార్పొరేషన్‌ పరిధిలోని అన్ని డివిజన్‌ల్లో మిగిలిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామన్నారు.

కొత్త ఆశలతో..

'ప్రజావాణి'కి దరఖాస్తుల వెల్లువ

- ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ
- సర్కారు మారడంతో అవే సమస్యలు అధికారుల చెంతకు
- ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని వైనం

వికారాబాద్‌: కలెక్టర్‌ కార్యాలయానికి అనేక సమస్యలతో నిత్యం ఎంతో మంది బాధితులు వస్తుంటారు. వారి బాధలు వినే సాధారణ పౌరులకు అయ్యో అనిపించినా.. అధికారుల మనసు మాత్రం కరగటంలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రజావాణికి వచ్చిన వారిలో ఎవరిని పలకరించి నా.. రకరకాల సమస్యల గురించి తమగోడు వెల్లబోసుకున్నారు. ధరణిలో ఆప్షన్‌ లేక.. మరికొన్ని కోర్టు పరిధిలో ఉండి అర్థం కాకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామంటూ కొందరు వెల్లడించారు. ఇలా అనేకులు ఇదే రీతిలో స్పందించారు. కాగా.. సమస్యల పరిష్కారానికి ఏళ్లతరబడి సమయం పడుతుండటంతో పాలనాధికారి గడప తొక్కుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. భూముల సమస్య సంగతి ఎలా ఉన్నా.. చిన్న వాటికి సైతం పరిష్కార మార్గం దొరకడం లేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. తక్షణ పరిష్కారానికి వీలున్న వాటిని కూడా అధికారులు పట్టించుకోకుండా తిప్పుతున్నారని పలువురు ఆరోపించారు. వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేస్తున్నారు.

వచ్చిన వారే మళ్లీమళ్లీ..

జిల్లాలో వేల ఎకరాల భూములు నిషేధిత(ప్రొహిబిటెడ్‌) జాబితాలో పడటం కూడా రైతులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. దీంతో రైతులు మీసేవా సెంటర్లు, తహసీల్దార్‌, ఆర్డీఓ, అడిషనల్‌ కలెక్టర్‌, కలెక్టర్‌ కార్యాలయాల చెంతకు కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌ డే కావటంతో వందల సంఖ్యలో కలెక్టరేట్‌ వద్ద రైతులు క్యూ కడుతున్నారు. ఇక్కడికి వస్తున్న ఫిర్యాదుల్లో 90 శాతానికి పైగా తిరస్కరించి పంపుతున్నారే తప్ప, పరిష్కరించటంలేదు. అయితే సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవటంతో రిజెక్ట్‌ అయిన వారే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటం గమనార్హం.

విసిగి వేసారిన బాధితులు

రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువు దీరడంతో ఒకే సమస్యపై ఏళ్లతరబడి తిరిగి విసిగి వేసారిన బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ప్రభుత్వ హయాంలో అయినా తమ సమస్య పరిష్కారం అవుతుందేమోనని కాగితాలు పట్టుకుని కలెక్టరేట్‌ తలుపు తడుతున్నారు. మీసేవా కేంద్రాల్లో ఇప్పటికే నాలుగైదు సార్లు దరఖాస్తు చేసుకుని విసిగిన వారు సైతం ఇక్కడి వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం దళితుబంధు కోసం ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి.



ప్రజావాణిలో సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలు

పాసుబుక్కులు ఇవ్వటంలేదు



మాది నవాబుపేట మండలం మాదారం గ్రామం. మాకు కొంత అసైన్డ్‌, కొంత పట్టా భూమి కలిపి మొత్తం నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇప్పుడు ఖాస్తులో కూడా మేమే ఉన్నాం. పాత పాసు పుస్తకాలు ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు తరువాత కొత్త బుక్కులు ఇవ్వలేదు. అప్పటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఒక్కోసారి ఒక్కో కారణం చెబుతున్నారే తప్ప పాసు పుస్తకాలు ఇవ్వటంలేదు.

– మర్రి రామయ్య, రైతు, మాదారం

ఎనిమిది నెలలుగా తిరుగుతున్నాం..



మా స్వగ్రామం బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల. మాకు 40 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం అసైన్డ్‌భూమి ఇచ్చింది. ఐదుమంది దాయాదులం. అందరికీ ఎకరంనర చొప్పున భూమి ఉంది. అందులో ఇప్పటికీ మేమే కాస్తులో ఉన్నాం. కొందరు రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు మా పొలాల పక్కన భూములు కొన్నారు. మా పొలాలను ఆక్రమించుకుని కంచెలు వేస్తున్నారు. వారితో ఎగలేక ఎనిమిది నెలల క్రితం సర్వేకోసం దరఖాస్తు చేసుకున్నాం. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం.

– దేవయ్య, తుంకిమెట్ల

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై..



వెంకటయ్య(ఫైల్‌)

ధారూరు: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలాడు. ఈ సంఘటన మండల పరిధి నాగారం చెరువులో సోమవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం కుమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన గాజుల వెంకటయ్య(48) శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో వెంకటయ్య కోసం కుటుంబీకులు బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేశారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో నాగారం చెరువు కట్టపై అతని షర్ట్‌ కన్పించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో గాలింపు చేపట్టగా వెంకటయ్య శవం లభ్యం అయ్యింది.

నాలుగు నెలల క్రితం భార్య..

మృతుడు వెంకటయ్య భార్య ఈశ్వరమ్మ నాలుగు నెలల క్రితం రైలు ఢీకొన్న ఘటనలో దుర్మరణం చెంది. ఆగస్టు 20న చింతకుంట గ్రామంలోని తల్లిగారి ఇంటికి వెళ్లి తిరిగి కాలి నడకన బయలుదేరింది. మైలారం కొత్తతండా రైల్వే వంతెన వద్ద రైలుపట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో ఆమె మృత్యువాత పడింది. ఇప్పుడు భర్త వెంకటయ్య చనిపోవడంతో కొడుకు హరిప్రసాద్‌ అనాథగా మిగిలాడు.

గ్రామంలో అభివృద్ధి భేష్‌



పార్కును పరిశీలిస్తున్న తమిళనాడు బృందం

మోమిన్‌పేట: గ్రామంలో అభివృద్ధి చాలా బాగుందని తమిళనాడు రాష్ట్ర బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది. సోమవారం మండలంలోని చీమల్‌దరి గ్రామాన్ని తమిళనాడు సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీపీల బృందం 35 మంది సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని అన్ని ప్రదేశాలను తిరిగి చూశారు. 100శాతం భూగర్భ మురుగు నీటి కాల్వల నిర్మాణం, సీసీ రోడ్లు, ప్రతి ఇంటి ఎదుట మొక్కల పెంపకం, గ్రామ పార్కు, శ్మశాన వాటిక, విద్యాలయం తదితర వాటిని పరిశీలించారు. ఇంత మొత్తంలో అభివృద్ధి ఎలా సాధ్యమని అడిగారు. స్థానికంగా లభించే ఆర్థిక వనరులను ఉపయోగించుకొని పంచాయతీలను అభివృద్ధి చేయడమే సర్పంచుల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. గ్రామాన్ని చూసి ఎంతో నేర్చుకొన్నామని వారు అభిప్రాయపడ్డారు. శుభ్రత, పచ్చదనం, గ్రామస్తులందరికి అహ్లాదకరమైన పార్కులు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, కార్యదర్శి సుగుణ తదితరులు ఉన్నారు.

ఓటర్లుగా నమోదు చేయించండి



మాట్లాడుతున్న లింగ్యానాయక్‌

వికారాబాద్‌ అర్బన్‌: జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారందరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చూడాలని అడిషనల్‌ కలెక్టర్‌, డిప్యూటీ డిస్ట్రిక్ట్‌ ఎలక్షన్‌ ఆఫీసర్‌ లింగ్యానాయక్‌ సూచించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలింగ్‌ బూత్‌ల వారీగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సోమవారం కలెక్టర్‌ కార్యాలయంలోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించి, మాట్లాడారు. ఎస్‌ఎస్‌ఆర్‌–2024లో భాగంగా వచ్చే జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతి, యువకులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. జనవరి 6న డ్రాఫ్ట్‌ పబ్లికేషన్‌ విడుదల చేయడం జరుగుతుందని, ఈ జాబితాలో ఏమైనా ఆక్షేపణలు, ఆరోపణలు ఉంటే జనవరి 22 వరకు తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు. వచ్చిన ఆక్షేపణలను స్వీకరించి ఫిబ్రవరి 2వరకు పరిశీలన పూర్తి చేసిన అనంతరం తుది ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, ఎలక్షన్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగుబుక్‌ ఆఫ్‌ రికార్డులో విష్ణువర్ధన్‌కు చోటు



అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్‌

ఇబ్రహీంపట్నం రూరల్‌: తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డులో ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్‌ గ్రామానికి చెందిన జంగిలి విష్ణువర్ధన్‌కు చోటు దక్కింది. మయూరి ఆర్ట్స్‌ ఫిల్మ్‌ం డ్యాన్స్‌ ఇనిస్టిట్యూట్‌ వారి సౌజన్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో గల భారతి విద్యా భవన్‌లో మయూరి ఆర్ట్స్‌ టాలెంట్‌ ఆఫ్‌ది ఇయర్‌ 2023లో భాగంగా 290 మంది 90 నిమిషాలు 19 గ్రూప్స్‌ 19 కేటాగిరిల్లో కప్పపహాడ్‌ నివాసి జంగిలి విష్ణువర్ధన్‌ అన్నమయ్య సంకీర్తనలు అలపించారు. ఆయన అలపించిన సంకీర్తనలు ప్రేక్షకులను ఎంతో గానో ఆకట్టుకున్నాయి. తన సంగీత గురువు అన్నమయ్య కళాసమితి గండేపల్లి సుమలత సారథ్యంలో విష్ణువర్ధన్‌ తన పాటలను పాడారు. దారళంగా, నిర్విరామంగా అన్నమయ్య సంకీర్తనలు శ్రోతలకు వినిపించడంతో తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డులో విష్ణువర్ధన్‌కు చోటు దక్కింది. తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డుతో పాటు వండర్‌ బుక్‌, జై ఇండియన్‌, తెలుగు బుక్‌, ఇండియా బుక్‌, జీనియస్‌ బుక్‌, కోహినూర్‌, గోల్డెన్‌ స్టార్‌, స్టేట్స్‌ బుక్స్‌, డైమండ్‌ రికార్డ్స్‌ల్లో స్థానం దక్కింది. గొప్ప పేరు తెచ్చుకోవడం పట్ల కప్పపహాడ్‌ గ్రామస్తులు విష్ణువర్ధన్‌ను ప్రసంశిస్తున్నారు.

తెల్లరేషన్‌దారులకే ఉచిత ప్రయాణం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: తెల్లరేషన్‌ కార్డు దారులకే ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించాలని ధర్మ సమాజ్‌ పార్టీ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేసింది. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ భారతి హోళీకేరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. ధనవంతులైన మహిళలకు ఉచిత ప్రయాణాన్ని నియంత్రించాలన్నారు. నెలకు లక్షా రూపా యలు సంపాదించే మహిళా ఉద్యోగులకు ఉచిత ప్రయాణం తగదన్నారు. దీని వల్ల ఆర్టీసీకి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఉచిత ప్రయాణం ప్రభావం ఆటో కార్మికులపై పడకుండా చూడాలన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణం సవరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు తులసిగారి శేఖర్‌, అమర్‌, ,చెన్నయ్య, రాకేష్‌, నర్సింహా ,రవీందర్‌లతో పాటు పాల్గొన్నారు.

తెలుగు లెక్చరర్‌ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ కాంచన లత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కమిషనర్‌ కళాశాల విద్యాశాఖ నుంచి తెలుగు అధ్యాపకుల నియామకానికి అనుమతి ఉత్తర్వులు వెలువడినట్లు చెప్పారు. అభ్యర్థులు తెలుగు సబ్జెక్టులో పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అలాగే ఎన్‌ఈటీ, ఎస్‌ఎల్‌ఈటీ, సెట్‌, పీహెచ్‌డీ, బోధనలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్టీయూ అండ

శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

మొయినాబాద్‌రూరల్‌: రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాల అభివృద్ధితో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధిని మెరుగు పరిచేలా పీఆర్టీయూ టీఎస్‌ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి అన్నారు. వారం రోజుల క్రితం మొయినాబాద్‌ మండలం హిమాయత్‌నగర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పటోళ్ల అనంతరెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం వారి కుటుంబ సభ్యులను కలిసి ఉద్యోగం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సంఘం ఎల్లప్పుడు ఉపాధ్యాయులకు అండగా ఉంటుందని చెప్పారు. అనంతరెడ్డికి సంఘంలో క్రియాశీల సభ్యత్వం ఉండటంతో లక్ష రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మొయినాబాద్‌ మండల శాఖ అధ్యక్షుడు బందయ్య, జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్‌, కృష్ణారెడ్డి, సత్తయ్యగౌడ్‌, వినోద్‌, సుదర్శన్‌, కృష్ణ, హన్మంత్‌, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌, రాములు, నరేందర్‌, నారాయణ, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పహాడీషరీఫ్‌: బాలిక అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ ఎన్‌.భాస్కర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన అజిమున్‌ బీబీ కుమార్తె తాజో కాతూన్‌(16), ఈ నెల 16న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. స్థానికంగా ఉండే సూరజ్‌ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ బాలిక తల్లి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చేవెళ్ల: మండలకేంద్రంలో అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సోమవారం సాయంత్రం చేవెళ్లలో వేంకటేశ్వరస్వామి ఆలయం, పోలీస్‌ క్వార్టర్స్‌కు మధ్యలో ఉన్న వేపచెట్టు కింది స్థానికులు ఓ వ్యక్తి చనిపోయి ఉన్న విషయాన్ని గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి కింద కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే చేవెళ్ల పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ వీరబ్రహ్మం కోరారు.

కారు బోల్తా..



గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న స్థానికులు



బోల్తా పడిన కారు

పలువురికి గాయాలు

పెద్దేముల్‌: కారు బోల్తా పడి పలువురికి గాయాలయిన ఘటన సోమవారం పెద్దేముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌ నుంచి కారులో 8 మంది యువకులు తాండూరుకు వస్తున్నారు. పెద్దేముల్‌ మండల ఖానాపూర్‌ గేటు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రిఫర్‌ చేసినట్లు సమాచారం. ఈ విషయమై పెద్దేముల్‌ ఎస్‌ఐ కాశీనాథ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ తెలియచేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్లు

పెద్దేముల్‌: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పెద్దేముల్‌ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఎస్‌ఐ కాశీనాథ్‌ తెలిపిన వివరాల ప్రకారం..పెద్దేముల్‌ మండల రుక్మాపూర్‌ వాగు నుంచి ఆదివారం రాత్రి అక్రమంగా ఖానాపూర్‌కు ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పోలీసులు పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. సోమవారం ట్రాక్టర్లకు సంబంధించిన యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కల్వకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్‌ పాలన ఉంటుందన్నారు. సోమవారం ఆమనగల్లు, మాడ్గుల మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కెఎల్‌ఐ డీ82 కాలువ పనులను పూర్తి చేసి అన్ని మండలాలకు సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని వివరించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రారంభమైందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మాడ్గుల మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ ధనయ్యగౌడ్‌, నాయకులు చంద్రయ్యగౌడ్‌, వెంకటేశ్‌గౌడ్‌, యాదయ్యగౌడ్‌, ధనయ్య, శ్రీను, మహేశ్‌, యాదయ్య, ఆమనగల్లు మాజీ వార్డు సభ్యులు సత్యం, నాయకులు తిరుపతయ్య, సురేశ్‌గౌడ్‌, శ్రీనివాసులు, పాండుగౌడ్‌, వెంకటేశ్‌, నర్సింహా, నరేందర్‌ పాల్గొన్నారు.

కాసం షోరూం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి షోరూం ప్రారంభిస్తున్న రష్మిగౌతమ్‌

శంకర్‌పల్లిలో సందడి చేసిన రష్మి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో ప్రముఖ వస్త్ర షోరూం అయిన కాసం ఫ్యాషన్స్‌ రెడీమెడ్‌ షోరూంను సినీ నటి, యాంకర్‌ రేష్మిగౌతమ్‌ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేష్మిగౌతమ్‌ మాట్లాడుతూ.. షోరూంలో అన్ని వయస్సుల వారికి నాణ్యతతో కూడిన రెడీమెడ్‌ వస్త్రాలతో పాటు మహిళలకు సరసమైన ధరలకే చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. కాసం సంస్థల చైర్మన్‌ కాసం నమశివాయ మాట్లాడుతూ.. తమ సంస్థ వరంగల్‌లో మొదటి స్టోర్‌ను ప్రారంభించామని అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ప్రాంతాల్లో కూడా తమ స్టోర్స్‌ ఓపెన్‌ చేశామని తెలిపారు. రష్మిని చూసేందుకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో షాపింగ్‌ మాల్‌ వద్దకు చేరుకున్నారు. సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. కార్యక్రమంలో కాసం మల్లికార్జున్‌, కాసం నమశివాయ, కాసం కేదారినాథ్‌, కాసం శివప్రసాద్‌, శంకర్‌పల్లి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి, వైస్‌ చైర్మన్‌ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్‌ వాణి, పీఏసీఎస్‌ చైర్మన్‌ శశిధర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.